



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక






సంచిక : 266 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 15-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00


పాఠకులకు ,ప్రకటనకర్తలకు,
ఏజెంట్లకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు

## సంక్రాంతి శుభాకాంక్షలు

నేడు మా కార్యాలయానికి సెలవు.
కావున శుక్రవారం 16-01-2026 సంచిక వెలువడదు
పునర్దర్శనం శనివారం 17-01-2026




# కొత్త సర్పంచులకు ట్రైనింగ్

సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు

- 19 నుంచి ఫిబ్రవరి 21 వరకు తరగతులు
- జిల్లాల వారీగా షెడ్యూల్ ఖరారు
- మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు టీజీఐఆర్డీ ద్వారా శిక్షణ
- శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు మొత్తం 253 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక
- చట్టంపై అవగాహన, ప్రజలకు మెరుగైన సేవే లక్ష్యంగా కార్యక్రమాలు

**హైదరాబాద్**

గ్రామ పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సమగ్ర శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ శిక్షణా షెడ్యూల్‌ను ఖరారు చేసింది. సర్పంచ్‌లకు వారి విధులు, నిధులు, బాధ్యతలు, హక్కులతో పాటు చట్టంపై లోతైన అవగాహన కల్పించేలా శిక్షణా మాడ్యూల్‌ను రూపొందించారు. ఇప్పటికే సర్పంచ్‌ల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్, కరదీపికను సిద్ధం చేశారు. మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు టీజీఐఆర్డీ ద్వారా శిక్షణను అందించనున్నారు.

-మిగతా 2 లో






# ఇరాన్‌ను తక్షణమే వీడండి

- ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి
- పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలి
- భారతీయులకు విదేశాంగశాఖ హెచ్చరిక

**న్యూఢిల్లీ**

ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు మరియు భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.. ఇరాన్‌లో నిరంతరం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా , వాణిజ్య విమానాలు సహా అందుబాటులో ఉన్న ఏదైనా రవాణా మార్గం ద్వారా భారతీయ పౌరులు ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించారు.ఇరాన్‌లో ఉన్న అన్ని భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని

-మిగతా 2 లో

## సంక్రాంతి సంబురాలు.

- కేంద్రమంత్రి ఇంట్లో పొంగలి వండిన ప్రధాని



2 లో



# దాడి చేస్తే ప్రతీకారమే

- ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక
- వెనక్కి తగ్గిన అమెరికా
- వైమానిక బేస్‌ల నుంచి సిబ్బంది ఉపసంహరణ

**దుబాయ్/దోహా:,**

తమ దేశంపై అమెరికా దాడి చేస్తే ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దీనితో వాషింగ్టన్ ఓ అడుగు వెనక్కి వేసింది. అమెరికా మధ్యప్రాచ్యంలోని వైమానిక స్థావరాల నుంచి కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకుంది. ఈ విషయాన్ని బుధవారం అమెరికా అధికారవర్గాలు ధ్రువీకరించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ ఎదుర్కొంటున్న దేశీయ అశాంతిని అణచివేయడానికి ఇరాన్ నాయకత్వం ప్రయత్నిస్తున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారుల తరపున జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే బెదిరింపు ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అమెరికాకు గట్టి సమాధానం ఇచ్చేందుకు టెహ్రాన్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిన

-మిగతా 2 లో

## చేనేత రుణమాఫీకి రూ.16.27 కోట్లు

- 6,784 మంది కార్మికులకు లబ్ది :
- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

2 లో



# 18న ఖమ్మం జిల్లాలో సీఎం పర్యటన

- సిపిఐ మహాసభలకు రేవంత్ హాజరు

**ఖమ్మం,**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ మహాసభల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అదేరోజు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ.25 కోట్లతో నూతనంగా నిర్మించిన మద్దులపల్లి మార్కెట్ యార్డ్, రూ.25 కోట్లతో నిర్మించిన నర్సింగ్ కళాశాల ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ.108

-మిగతా 2 లో



# తెలంగాణను కుదిపేసిన గల్ఫ్ మోసాల గుట్టు

గల్ఫ్ కలల వెనుక నరకం..
తెలంగాణ యువతపై నకిలీ ఏజెంట్ల దోపిడీ

- కంపెనీ వీసా మోసం....ఎడారి దేశాల్లో బానిసలుగా మారిన యువకులు
- "అమ్మా నేను బతికే ఉన్నా" -- గల్ఫ్ బాధితుల హృదయ విదారక వేదన
- గల్ఫ్ ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణా



**హైదరాబాద్, జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ వ్యాప్తంగా గల్ఫ్ ఉపాధి పేరుతో సాగుతున్న నకిలీ ఏజెంట్ల మోసాల వెనుక ఉన్న చీకటి వ్యవస్థ ఇప్పుడు బయటపడింది. ఆకర్షణీయమైన జీతాలు, కంపెనీ వీసా హామీలతో యువతను మభ్యపెట్టి, చివరకు ఎడారి దేశాల్లో అమానుష పరిస్థితుల్లో బానిసలుగా మార్చుతున్న దందా రాష్ట్రమంతా విస్తరించి ఉన్నట్టు నీలగిరి ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌క్లూజివ్ దర్యాప్తులో వెల్లడైంది.

-మిగతా 2 లో



"నీలగిరి ఎక్స్ ప్రెస్ " ( ఎక్స్ క్లూజివ్





# సంచలనాల ముసుగులో పరిపాలనపై దాడులు!

- తెలంగాణ ఐఏఎస్ అధికారులపై వక్రీకరణలు సహించబోం
- మీడియా ట్రయల్ పేరుతో పరిపాలనపై దాడి
- ఎన్టీవీ చర్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధం కఠిన చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు నిడిగొండ శ్రీరామ్



**హైదరాబాద్, జనవరి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎన్టీవీ ఛానల్‌లో మహిళా ఐఏఎస్ అధికారిపై ప్రసారమైన కథనం వాస్తవాల ఆధారంగా కాకుండా ఊహాగానాలు, ఆరోపణలను సంచలనంగా మలిచిన ఉదంతమని తెలంగాణ జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండించింది. విచారణ పూర్తికాకముందే ఒక అధికారిని నిందితురాలిగా చిత్రీకరించడం మీడియా ట్రయల్‌కు సమానమని సంఘం పేర్కొంది.తెలంగాణ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు నిడిగొండ శ్రీరామ్ మాట్లాడుతూ---ఇది ఒక అధికారిపై మాత్రమే కాదు, మొత్తం ఐఏఎస్ వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాల్సిందేనని స్పష్టం చేశారు. "తెలంగాణ రాష్ట్ర పాలనను నిలబెట్టిన ప్రధాన స్తంభాలు ఐఏఎస్ అధికారులు. వారి నిజాయితీ, వృత్తిపరమైన నిబద్ధతపై అనుమానాలు కలిగించేలా ప్రసారాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య" అని అన్నారు. మహిళా ఐఏఎస్ అధికారిపై విచారణ కొనసాగుతున్న దశలోనే ఆమె ప్రతిష్ఠను దెబ్బతీసేలా కథనాన్ని రూపొందించడం న్యాయసూత్రాలకు విరుద్ధమని శ్రీరామ్ పేర్కొన్నారు. "నిరూపణ లేని ఆరోపణలను నిజాలుగా ప్రజల ముందుంచడం మీడియా బాధ్యత కాద"ని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఎన్టీవీ యాజమాన్యం ప్రత్యక్ష బాధ్యత వహించాల్సిందేనని సంఘం డిమాండ్ చేసింది. ప్రజల్లో అపోహలు సృష్టించేలా, పరిపాలనా వ్యవస్థను అపఖ్యాతి పాలు చేసేలా ప్రసారాలు చేసినందుకు

-మిగతా 2 లో

# కొత్త సర్పంచులకు ట్రైనింగ్

మొదటి తరువాయి




గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పారదర్శక పరిపాలన లక్ష్యంగా ఈ శిక్షణ ఉండనుంది. సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పనిచేసేలా, గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ నెల 19 నుంచి ఫిబ్రవరి 21 వరకు జిల్లాలవారీగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలో ఐదు బ్యాచ్‌లుగా ఐదు రోజుల పాటు సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తారు. ఒక్కో బ్యాచ్‌లో కనీసం 50 మంది సర్పంచ్‌లు పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు బస, భోజనం, శిక్షణా ఖర్చుల కోసం ఒక్కరికి రూ.5,000 వరకు ప్రభుత్వం వెచ్చించనుంది. శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు మొత్తం 253 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, వారికి టీజీఐఆర్డీలో ఇప్పటికే ఓరియంటేషన్ పూర్తిచేశారు. వీరు సర్పంచ్‌లకు ప్రాక్టికల్‌గా ఉపయోగపడే విధంగా, పాలన, అభివృద్ధి, ఆర్థిక నిర్వహణ, ప్రజాసేవ అంశాలను బోధిస్తారు. సర్పంచ్ శిక్షణా తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీచేసింది. సర్పంచ్‌లకు సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామ పంచాయతీలు బలోపేతం అవుతాయనీ, పారదర్శకమైన పాలన, సమర్థవంతమైన నిధుల వినియోగం, ప్రజల అవసరాలకు వేగంగా స్పందించే వ్యవస్థ ఏర్పడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

# ఇరాన్‌ను తక్షణమే వీడండి

మొదటి తరువాయి

మరియు పరిస్థితిపై తాజా పరిస్థితుల కోసం స్థానిక మీడియాను ఫాలో కావాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది.. భారత పౌరులు తమ ప్రయాణ మరియు ఇమ్మిగ్రేషన్ పత్రాలన్నింటినీ పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని.. తక్షణమే అందుబాటులో ఉండాలని రాయబార కార్యాలయం కోరుతోంది. వారికి ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా వారు కోరారు. ఇటీవలి ఇరాన్‌లో విస్తృత నిరసనలు, హింస మరియు భద్రతా చర్యలు జరిగాయి, దీనివల్ల విదేశీ పౌరుల భద్రత గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకుంటామని అమెరికా బెదిరిస్తూనే ఉన్న విషయం విదితమే..

# 18న ఖమ్మం జిల్లాలో సీఎం పర్యటన

మొదటి తరువాయి

కోట్లతో నిర్మించబోయే జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. అందులో భాగంగా మద్దులపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని సీపీ సునీల్‌దత్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి.రాంప్రసాద్, మార్కెట్ చైర్మన్ హరినాదబాబులు పరిశీలించారు.

# సంక్రాంతి సంబురాలు.

కేంద్రమంత్రి ఇంట్లో పొంగలి వండిన ప్రధాని



**న్యూఢిల్లీ**

ప్రధాని నరేంద్రమోదీ సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. దేశ రాజధాని డిల్లీలో కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు సంక్రాంతి శుభాంకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రధాని గోవులకు పూజ చేశారు. ఆ తర్వాత పొంగలి వండారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు కూడా ఉన్నారు.సంక్రాంతి వేడుకల అనంతరం మోదీ మాట్లాడుతూ.. గత ఏడాది తాను తమిళనాడులో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైనట్లు గుర్తుచేసుకున్నారు. వెయ్యి సంవత్సరాల పురాతనమైన గంగైకొండ చోళపురం ఆలయ సందర్శన, పంబన్ వంతెన ప్రారంభోత్సవ సమయాల్లో తమిళుల చరిత్ర గొప్పతనాన్ని తెలుసుకున్నట్లు తెలిపారు. కొన్ని నెలల క్రితం సహజ వ్యవసాయంపై తమిళనాడులో జరిగిన ఓ సమావేశానికి తాను హాజరైనట్లు మోదీ చెప్పారు. లాభదాయకమైన వృత్తులను వదిలి, వ్యవసాయం వైపు మళ్లిన యువతను తాను అక్కడ కలిశానని, వ్యవసాయ రంగంలో విప్లవాన్ని తీసుకురావడానికి వారు చేస్తున్న కృషిని మరింత విస్తరించాలని నిర్ణయించుకున్నానని ప్రధాని అన్నారు. దేశంలో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, పర్యావరణానికి అనుకూలంగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత వంటివి అందుబాటులోకి తీసుకువస్తామని ప్రధాని చెప్పారు. రైతులు దేశ నిర్మాణంలో బలమైన భాగస్వాములని, వారిని మరింత శక్తిమంతంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిబద్ధతతో పనిచేస్తోందని అన్నారు.

# దాడి చేస్తే ప్రతీకారమే

మొదటి తరువాయి

ప్రాంతాల్లోని కీలక స్థావరాల నుంచి అమెరికా కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకోవడం గమనార్హం. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా సైనిక జోక్యం జరిగే అవకాశం ఉందని యూరోపియన్ అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో దీనిపై ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని ఓ ఇజ్రాయిల్ అధికారి తెలిపారు. అయితే దాని పరిధి, సమయాన్ని స్పష్టంగా చెప్పలేదు.

**ఖతార్‌లో యూఎస్ ఎయిర్‌బేస్**



ఖతార్‌లోని అతిపెద్ద యూఎస్ స్థావరం అయిన అల్ ఉదీద్ వైమానిక స్థావరం నుంచి ఉపసంహరణలు జరుగుతున్నాయని ఖతార్ దేశం కూడా తెలిపింది. గతేడాది ఇరాన్ క్షిపణి దాడికి కొన్ని గంటల ముందు జరిగినట్టుగా పెద్ద సంఖ్యలో సైనికులను సాకర్ స్టేడియం, షాపింగ్ మాల్‌కు బస్సుల్లో తరలించినట్లు తక్షణ సంకేతాలు లేనప్పటికీ, కొంతమంది సిబ్బందిని స్థావరం నుంచి బయటకు వెళ్లమని చెప్పినట్టు ముగ్గురు దౌత్యవేత్తలు తెలిపారు. ఇరాన్‌లో రెండు వారాల క్రితం ఆ దేశ ఆర్థిక పరిస్థితులకు వ్యతిరేకంగా ప్రదర్శనలుగా ప్రారంభమయ్యాయి. ఈ అశాంతిని ఇటీవలి రోజుల్లో వేగంగా తీవ్రతరం చేసి, ఇరాన్‌లో మతాధికారుల పాలనను స్థాపించిన 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అత్యంత హింసాత్మకమైనదంటూ ఆదేశంపై పాశ్చాత్య దేశాలు ప్రచారం చేస్తున్నాయి. ఈ నిరసనల్లో 2,600 మందికి పైగా మరణించారని ఒక హక్కుల సంస్థ పేర్కొన్నట్టు వార్తల్ని విస్తృతం చేశారు. అయితే ఇరాన్ ఇంతటి విధ్వంసాన్ని ఎప్పుడూ ఎదుర్కోలేదని ఆ దేశ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దుల్‌రహీం మౌసావి బుధవారం తెలిపారు. పాశ్చాత్య దేశాల ప్రచారాన్ని విదేశీ శత్రువులని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌లోని అంతర్గత వ్యవహారాలపై ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి జీన్-నోయెల్ బారోట్ మాట్లాడుతూ ఇరాన్ సమకాలీన చరిత్రలో ఇదో అత్యంత హింసాత్మక అణచివేత అని కామెంట్స్ చేశారు. దీనిని కూడా ఇరాన్ అధికారులు సమర్థవంతంగా తిప్పికొడుతున్నారు. తమ దేశంలో అశాంతిని సాయుధ ఉగ్రవాదుల పేరుతో అమెరికా, ఇజ్రాయిల్ రెచ్చగొడుతున్నాయని చెప్పారు. మరోవైపు యూఎస్ ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుంటే, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి టర్కీ వరకు ప్రాంతీయ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడి చేస్తామని టెహ్రాన్ స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఖ్చి అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మధ్య ప్రత్యక్ష సంబంధాలను నిలిపివేశారు. ఖతార్‌లోని అల్ ఉదీద్‌లో సెంట్రల్ కమాండ్ ఫార్వర్డ్ హెడ్‌క్వార్టర్స్, బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీకి చెందిన ఐదవ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంతో సహా ఈ ప్రాంతం అంతా యూఎస్ బలగాల స్థావరాలు ఉన్నాయి. ఇరాన్ ప్రభుత్వం పతనం అంచున ఉన్నట్టు కనిపించడం లేదంటూ ఓ పాశ్చాత్య అధికారి చెప్తూ, అక్కడి మరణహోమం తీవ్రంగా ఉందంటూ ఆరోపణలు చేశారు. గతేడాది జూన్‌లో ఇరాన్‌పై ఇజ్రాయిల్ ద్వారా అమెరికా నేరుగా బాంబుదాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే దీన్ని ఇరాన్ సమర్థవంతంగా తిప్పికొట్టి, అమెరికాకు వెన్నులో వణుకు పుట్టించింది. దీనితో అప్పుడు తాత్కాలికంగా వెనక్కి తగ్గిన అమెరికా, ఇప్పుడు ఆ దేశంలో అంతర్యుద్ధం ద్వారా రాజకీయ అస్థిరత సృష్టించాలని ప్రయత్నిస్తోంది.

# చేనేత రుణమాఫీకి రూ.16.27 కోట్లు

**-- 6,784 మంది కార్మికులకు లబ్ధి :**
**-వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు**



**హైదరాబాద్**

చేనేత కార్మికుల రుణమాఫీ కోసం రూ.16.27 కోట్ల అదనపు నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రూ. 33 కోట్ల నిధులు చేనేత కార్మికుల అకౌంట్లలో జమ చేసేందుకు ఆయా జిల్లాలకు విడుదల చేశామని తెలిపారు. వాటికి అదనంగా ఈ నిధులను విడుదల చేస్తున్నట్టు తెలిపారు. 2017 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు వ్యక్తిగత రుణాలు తీసుకున్న చేనేత కార్మికులకు ఈ రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. ఫలితంగా మొత్తం 6,784 మంది లబ్ధి పొందుతున్నట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.960 కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడూ పని కల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో నుంచే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ఇప్పటివరకు రూ.896 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా 30 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రూ.150 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామనీ, గత ప్రభుత్వం కార్మికులకు బకాయి పడ్డ రూ.290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఈ ఏడాది జిల్లా సహకార బ్యాంకుల ద్వారా 78 సహకార సంఘాలకు రూ.19 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ మంజూరు చేశామని మంత్రి వివరించారు

# తెలంగాణను కుదిపేసిన గల్ఫ్ మోసాల గుట్టు

– మొదటి తరువాయి

**కంపెనీ వీసా హామీ చివరకు విజిటింగ్ వీసాతో మోసం**

ఉద్యోగం ఖాయం అంటూ కంపెనీ వీసా పేరుతో నమ్మబలికిన ఏజెంట్లు, వాస్తవానికి విజిటింగ్ వీసాలతో గల్ఫ్ దేశాలకు పంపుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. అక్కడికి చేరుకున్న తర్వాత పాస్పోర్టు లాక్కోవడం, జీతాలు ఇవ్వకుండా పని చేయించడం, తిండి కూడా ఇవ్వకుండా వేధించడం వంటి ఘటనలు తెలంగాణ నలుమూలల నుంచి బయటపడుతున్నాయి.

**– అప్పులు చేసి వెళ్లిన యువతా ఎడారిలో మిగిలిన కన్నీళ్లు**

గ్రామాలు--పట్టణాలు అన్న తేడా లేకుండా అనేక జిల్లాల నుంచి వేలాది మంది యువకులు అప్పులు చేసి గల్ఫ్‌కు వెళ్లి నరకయాతన అనుభవిస్తున్నారు. రోజుల తరబడి ఆహారం లేకుండా, పని అడిగితే దాడులకు గురవుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి.

**– రాష్ట్రవ్యాప్తంగా పాతుకుపోయిన ఏజెంట్ల ముఠాలు**



ప్రధాన ఏజెంట్లు--సబ్ ఏజెంట్లుగా విడిపోయి, జిల్లా కేంద్రాల నుంచి మండల స్థాయి వరకు నకిలీ ముఠాలు విస్తరించినట్టు దర్యాప్తులో తేలింది. నకిలీ ఒప్పందాలు, మాట తప్పింపులు, బెదిరింపులతో యువతను మోసగిస్తున్న తీరు స్పష్టంగా బయటపడింది.

**– ఆధారాలతో కదిలిన పోలీసు యంత్రాంగం**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ సేకరించిన కీలక ఆధారాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనేక చోట్ల ఏజెంట్ల కార్యాలయాలపై దాడులు చేసి వందల సంఖ్యలో పాస్పోర్టు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగుతోంది.

**– బాధితులను బెదిరింపులొ తప్పించుకునే యత్నాలు**

బాధితులు ప్రశ్నిస్తే "మాకు సంబంధం లేదు" అంటూ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నాలు, బెదిరింపులు చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఇవి నకిలీ ఏజెంట్ల దారుణానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా మారాయి.

**– కదిలిన వ్యవస్థ... ప్రభుత్వంపై డిమాండ్**

ఈ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత కొందరు బాధితులు స్వదేశానికి చేరుకోగా, ఇంకా గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారి వివరాలు కూడా బయటపడుతున్నాయి. గల్ఫ్ మోసాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులందరినీ క్షేమంగా స్వదేశానికి రప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది.

# సంచలనాల ముసుగులో పరిపాలనపై దాడులు!

మొదటి తరువాయి

ఎన్టీవీ ఛైర్మన్, సీఈఓలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అరెస్టు చేయాలని శ్రీరామ్ డిమాండ్ చేశారు.అదేవిధంగా, కేంద్ర సమాచార ఉ ప్రసార మంత్రిత్వ శాఖ వెంటనే జోక్యం చేసుకుని ఎన్టీవీ శాటిలైట్ ఛానల్ లైసెన్స్‌ను సమీక్షించి రద్దు చేయాలని సంఘం కోరింది. "మీడియా స్వేచ్ఛ పేరుతో వ్యవస్థలను దూషించే ఛానళ్లకు లైసెన్స్ కొనసాగించడం ప్రజాస్వామ్యానికి ముప్పు" అని హెచ్చరించారు.మీడియా స్వేచ్ఛ అనేది బాధ్యతతో కూడినదేనని, సంచలనాల కోసం వ్యక్తుల ప్రతిష్ఠను, వ్యవస్థల విశ్వసనీయతను తాకట్టు పెట్టే హక్కు ఏ ఛానల్‌కూ లేదని సంఘం స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో తెలంగాణ జర్నలిస్టుల సంఘం రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారులందరికీ, ముఖ్యంగా సంబంధిత మహిళా ఐఏఎస్ అధికారికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. "వారి సేవా నిబద్ధతే వారి అసలైన గుర్తింపు. ఒక ఛానల్ చేసిన వక్రీకరణలు ఐఏఎస్ వ్యవస్థను కించపరచలేవు" అని నిడిగొండ శ్రీరామ్ తేల్చిచెప్పారు.

# సంబురంగా ముగ్గుల పోటీలు





**ఆమనగల్లు, జనవరి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మండల గ్రామ పరిధిలోని ప్రతి పల్లెలో భోగి పర్వదినం సందర్భంగా బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సంబురంగా జరిగాయి. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీలలో విజేతలైన మహిళలకు మొదటి బహుమతిగా రూ.3000 రూపాయలు పట్టుచీర, ద్వితీయ బహుమతిగా రూ. 2000 రూపాయలు పట్టుచీర, అదేవిధంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 300 మహిళలందరికీ ఒక పట్టు చీర పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో నాగిళ్ల జగన్, ట్రస్ట్ ఇంచార్జి ఆమనగల్లు టిఆర్ఎస్ యూత్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మకొండ రాజు, టిప్పు సుల్తాన్, సయ్యద్ ఖలీల్, గణేష్, గుత్తి బాలస్వామి, సైదుల్ గౌడ్, ప్రవీణ్, కిరణ్ , శ్రీరాములు, సుదర్శన్, ప్రభు శంకర్, ముజాహిద్,అలీమ్, సన్నీ, బన్నీ, గౌస్, పద్మ, బాలమణి, విమలమ్మ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదా రంగనాథ స్వామి కల్యాణం





**వినోభా నగర్, జనవరి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గోదా రంగనాథ స్వామి ఎదురుకోళ్ల ఉత్సవం, గోదా రంగనాథ స్వామి కల్యాణం వేద మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ఇంకా వివాహం కాని వారి కోసం వారణమాయిారం కార్యక్రమం జరిగింది. పండితులు గోదా దేవి శ్రీరంగనాథుడిని భర్తగా కోరుకుని, ఆయనలో విలీనమై గోదా కళ్యాణంతో ముక్తి పొందిందని భక్తులకు వివరించారు. పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేడుక అనంతరం దేవస్థాన పాలక మండలి ఆధ్వర్యంలో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 550 మందికి పైగా భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సర్పంచ్ మహేష్ గౌడ్



**కందుకూర్, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండలంలోని గుమ్మడవెల్లి గ్రామ సర్పంచ్ పల్స మహేష్ గౌడ్ మాట్లాడుతూ -- "గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. సొంత డబ్బులతో వీధి దీపాల ఏర్పాట్లు ప్రారంభించాం. డ్రైనేజ్, రోడ్ల సమస్యలు వంటి ప్రతి ఇబ్బందిని పాలకవర్గం వార్డులలో తిరిగి పరిష్కరిస్తుంది. గుమ్మడవెల్లిని మండల కేంద్రంలో ఆదర్శ గ్రామంగా నిలుపుతాం" అని తెలిపారు.ఈ పనుల్లో ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు దగ్గరుండి పర్యవేక్షణ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# పల్లెపల్లెనా ముగ్గుల పోటీలు.. ఉప్పల వెంకటేష్ గుప్తా సంతోషాల రంగవల్లులు





**- కడ్తాలలో అట్టహాసంగా ఉప్పల వెంకటేష్ గుప్తా పుట్టినరోజు వేడుకలు**
**- ముగ్గుల పోటీలతో ఆత్మీయత పెంపొందేలా.. సంప్రదాయం ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు**
**-రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**

**కడ్తాల్, జనవరి 14 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
సంక్రాంతి పండుగ సాంస్కృతి సాంప్రదాయ ఒరవడిని చాటి చెబుతుందని తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గుప్తా, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాలు అన్నారు. బుధవారం ఉప్పల వెంకటేష్ గుప్తా పుట్టినరోజు వేడుకల సందర్భంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కడ్తాల్ మండల కేంద్రంలోని రచ్చబండ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి బి మహాలక్ష్మి, జయమ్మ లకు చెరో రూ. 5.000/- వేల నగదు. పట్టు చీరలు, రెండవ బహుమతి అమృతం సరస్వతి, వరికుప్పల మౌనిక, చెరో 3.000, వేల నగదు పట్టుచీర, మూడవ బహుమతి తుప్పరి దివ్య కు అందజేశారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులను ఉప్పల వెంకటేష్



గుప్తా, గంప వెంకటేష్ గుప్తాల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఉప్పల వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా ఉప్పల వెంకటేష్ గుప్త హాజరై మూడు వందల మహిళా తల్లుల ముంగిట తన పుట్టినరోజు కేక్ కట్ చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆత్మీయత పెంపొందేలా సాంప్రదాయం ప్రతిబింబించేలా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని కోరారు. తెలుగు ప్రజల పండుగల్లో సంక్రాంతి పెద్ద పండుగని గుర్తు చేశారు. పండుగ శోభ ఉట్టిపడేలా ప్రత్యేక కార్యక్రమాలు చేసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ సాంస్కృతి సాంప్రదాయ ఒరవడిని చాటి చెబుతుందన్నారు. రంగవల్లుల కార్యక్రమం ద్వారా తెలుగు ప్రజల లోగిళ్లు సంతోషాల హరివిల్లు ఉట్టిపడుతుందని గుర్తు చేశారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలలో ఉప్పల వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా ముగ్గుల పోటీలు అట్టహాసంగా సాంప్రదాయ బద్ధంగా సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు గంప శ్రీనివాస్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, వార్డు సభ్యులు మంగి మహేష్, గణేష్, రవి, మాజీ కోఆప్షన్ నెంబర్ జహంగీర్ బాబా, రాఘవేందర్, మహేష్, సిహెచ్ భాను, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, వెంకటయ్య, మాదారం గణేష్, జి వి జి టీం సభ్యులు ప్రశాంత్, సురేష్, దాసు, బొగ్గు మహేష్, పోతుగళ్ల సాయి, మనీ, నాని, అశోక్ రెడ్డి, నరేందర్ రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు పాలాది ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు రామకృష్ణ గుప్తా, ఆర్యవైశ్య సంఘం యువజన అధ్యక్షుడు బి రామకృష్ణ, సంద కిరణ్, పసుపుల వీరేష్, జూలూరి భరత్, రవి, గంప ప్రవీణ్, గుద్దేటి వంశీ, సాయి, రఘు, ఉపేందర్, రాఖీ, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మహేష్, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు సర్పంచ్ ప్రవీణ్‌కు మిత్రుల సన్మానం



**ఎలిగేడు, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలిగేడు గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన కప్పల ప్రవీణ్‌ను చిన్ననాటి మిత్రులు, ఎస్ఎస్సి బ్యాచ్ 2004--05 స్నేహితులు బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "మా మిత్రుడు ప్రవీణ్ సర్పంచ్ అవడం మాకు గర్వకారణం. గ్రామ అభివృద్ధిలో మా వంతు సహకారం అందిస్తాం" అని తెలిపారు.సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ -- "సన్మానం చేయడమే కాక అభివృద్ధికి సహకారం అందిస్తామని మిత్రులు చెప్పడం నాకు ఎంతో ఆనందం. అందరికీ కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.

# ఘనంగా శ్రీ గోదా రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం



**కూకట్ పల్లి జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్పల్లి గ్రామంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ గోదా రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, కూకట్ పల్లి సీనియర్ పాత్రికేయలు పరమేష్, తులసి రావు, శ్రీనివాస రావు పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని శ్రీ గోదా రంగనాయక స్వామి కృపకుపాత్రులైనారు.

# ర్యాకల్ దేవ్‌పల్లిలో ముగ్గుల పోటీలు





**ఎలిగేడు, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ మద్దెల రమా సంపత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పోటాపోటీగా వేసిన రంగురంగుల ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ -- "మహిళా యువతుల ప్రతిభను ప్రోత్సహించేందుకు, సంస్కృతిని నిలుపుకోవడానికి ఈ పోటీలు ఏర్పాటు చేశాం" అని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగీత--సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రేమలత--కమలాకర్ రెడ్డి, కార్యదర్శి హరిబాబు, వార్డ్ మెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, జనవరి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపాలిటీలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు బుధవారం ఆమనగల్లు పట్టణం శుభం కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఉప్పల వెంకటేష్ ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం నాయకులు ఏర్పాటుచేసిన కేకును కటింగ్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ళ జగన్, ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ ఇంచార్జ్ ఆమనగల్లు బిఆర్ఎస్ యూత్ వింగ్ కల్వకుర్తి నియోజకవర్గం అధ్యక్షులు గుమ్మకొండ రాజు, టిప్పు సుల్తాన్, సయ్యద్ ఖలీల్, వరికుప్పల గణేష్,గుత్తి సైదులు గౌడ్, బాలస్వామి, ఈర్ల పల్లి ప్రవీణ్, జంతుక కిరణ్, వడ్డే శ్రీరాములు,లక్ష్మణ్, కర్నే సుదర్శన్, ప్రభు శంకర్, ముజాహిద్, అప్రోచ్,అలీమ్, హైమద్, పల్లె సన్నీ, పల్లె బన్నీ,కళ్యాణ్,గౌస్,పద్మ, బాలమణి,విమలమ్మ, లలితమ్మ మహిళలు పాల్గొన్నారు.

# కడ్తాలలో ఘనంగా భోగి వేడుకలు





**కడ్తాల్, జనవరి 14**
మూడు రోజుల ముచ్చటైన పండుగ సంక్రాంతిలో భాగంగా బుధవారం తొలి రోజు భోగి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే లేచి భోగి మంటలు వేసుకొని మంగళ స్నానాలాచరించి దైవ దర్శనం చేశారు. కొందరు సాయంత్రం భోగి మంటలు కాల్చారు. మరో వైపు మహిళలు తమ వాకిళ్లలో అందమైన ముగ్గులు వేశారు. పిండి వంటలు తయారు చేసుకొని విందులు ఆరగించారు. బంధువులతో గృహాల్లో సందడి నెలకొంది. సాయంత్రం పిల్లలకు భోగి పండ్లు పోసి అక్కడక్కడా బొమ్మల కొలువు నిర్వహించారు. మహిళలు, యువతులు, ముత్తైదువులను ఆహ్వానించి నోములు, పసుపు, కుంకుమలు వాయినాలుగా పంచుకున్నారు. మైసిగండిలో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్,మక్తమాదారం లో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ముదిరాజ్ భోగి మంటలను వేశారు.

# జొన్నరాశి కొండపై ఘనంగా గోదా రంగనాయకుల కళ్యాణం మహోత్సవం



**కడ్తాల్, జనవరి 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండల్ బాలాజీ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ధనరాశి కొండపై వెలసిన శ్రీ రాధాకృష్ణ స్వామి వారి దేవాలయంలో ఆలయ వ్యవస్థాపకులు శ్రీ రామవత్ బిచ్యా నాయక్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య గోదా రంగనాయకుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరియు ప్రత్యేక పూజ కార్యక్రమాలకు సహకరిస్తున్న భక్తులందరిని అభినందించారు. భక్తులందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మూడ అశోక్,నవీన్ నాయక్,రవి నాయక్,పాండు నాయక్,ధర్మా నాయక్,సేవ్య నాయక్,జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెర్క ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు



**పెద్దపల్లి ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి పట్టణంలోని 26వ వార్డులో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుక్క కమల, పెర్క ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ దాసరి మమత రెడ్డి హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వార్డు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. పట్టణ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన ఈ కార్యక్రమంలో మహంకాళి సిద్దు, ఒడ్డేపల్లి తిరుమల్, కుక్క ఆల్బర్ట్, పెర్క సిద్దార్థ్ తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆర్.టి.ఏ ప్రాంగణంలో మహిళల రంగవల్లుల పోటీలు




**కరీంనగర్ జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2026 క్యాలెండర్‌లో 14వ రోజు కార్యక్రమం భాగంగా, కరీంనగర్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆర్.టి.ఏ ప్రాంగణంలో రోడ్డు భద్రత థీమ్‌తో మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్.టి.సి కరీంనగర్ 1, 2 డిపోలకు చెందిన మహిళలతో పాటు ఆదర్శ, టి.వి.యస్, సుజుకి షోరూముల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏ.యమ్.వి.ఐలు స్రవంతి, హరిత నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా డి.టి.సి పి. పురుషోత్తం, డి.టి.ఓ శ్రీకాంత్ చక్రవర్తి, యమ్.వి.ఐ రవికుమార్, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ నీలం సంపత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏ.యమ్.వి.ఐ సురేష్, ట్రాఫిక్ పార్క్ ట్రైనర్ సారిక, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 31వ తేదీన బహుమతులు అందజేస్తామని అధికారులు తెలిపారు.

# వరంగల్‌లో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్, డైరీని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పనిచేస్తోందని, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, ఇన్చార్జులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలపై ఆల్ పార్టీ సమావేశం



**కరీంనగర్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్ ఆధ్వర్యంలో ఆల్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ సూచనలు, ఆలోచనలను వ్యక్తపరిచారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలపై చర్చ జరిగింది. కరీంనగర్ జిల్లా ఏఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ కూడా సమావేశంలో పాల్గొని కొన్ని సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ఎన్నికల నిర్వహణలో సమన్వయం, పారదర్శకతకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

# మాణిక్యమ్మగూడలో ఎంపిఎల్-6 ప్రారంభం



**మహేశ్వరం, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని మాణిక్యమ్మగూడలో ప్రీమియర్ లీగ్--6 (ఎంపిఎల్ 2026) క్రికెట్ మ్యాచ్‌లు జనవరి 14 నుంచి 15 వరకు జరుగుతున్నాయి. ఈ మ్యాచ్‌లు దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి సహకారంతో నిర్వహించబడుతున్నాయి. గ్రామ సర్పంచ్ పద్మకృష్ణ, ఉపసర్పంచ్ దేవరంపల్లి దయాకర్ రెడ్డి, వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్లు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పద్మకృష్ణ గ్రామ ప్రజలకు భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆకుతోటపల్లిలో ఘనంగా ఉప్పల వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు





**ఆమనగల్, జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆకుతోటపల్లి గ్రామంలో ఉప్పల వెంకటేష్ గుప్తా పుట్టినరోజు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా, విజేతలకు నగదు, పట్టుచీరలు బహుమతులుగా అందజేశారు. పాల్గొన్న వారందరికీ గ్రామ పెద్దలు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళలు కలిసి కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. అభిమానులు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ కోప్పుల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ -- "సంక్రాంతి పండుగ సాంస్కృతి, సంప్రదాయ ఒరవడిని ప్రతిబింబిస్తుంది. రంగవల్లుల కార్యక్రమం ద్వారా తెలుగు లోగిళ్లు సంతోషాల హరివిల్లు ఉట్టిపడుతుంది" అని అన్నారు. గ్రామ ఉపసర్పంచ్ ఓర్సు శ్రీను, పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎలిగేడు లో క్రికెట్ టోర్నీ ప్రారంభం



**ఎలిగేడు, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని ఎలిగేడు గ్రామ ఉపసర్పంచ్ ముంజం నరేష్ కుమార్ అన్నారు. బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలో యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ -- "క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, పరిచయాలు, క్రమశిక్షణ పెరుగుతాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు కాంపల్లి సాయి ప్రశాంత్, రాజు, శేఖర్, ప్రదీప్, క్రీడాకారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు



**దేవరకొండ జనవరి 14. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా, డిండి మండలం, గోనబోయినపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సర్పంచ్ వర్కాల బాల నారాయణ ఆధ్వర్యంలో మరియు 10 మంది వార్డు సభ్యుల సహకారంతో,మరియు డిండి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గ్రామ ప్రజలు ఉత్సాహంతో పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వర్గాల బాల నారాయణ మాట్లాడుతూ గోనబోయినపల్లిలో మొదటిసారి నిర్వహించిన సంక్రాంతి పండుగ సంబరంలో భాగంగా ముగ్గుల పోటీలలో పాల్గొనినటువంటి మహిళలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ సంక్రాంతి పండుగ అంటేనే రంగుల హరివిల్లుగా చెప్పుకునే పండుగగా దాన్యము ఇంటికి చేరుకొని రైతులందరూ సుఖసంతోషాలతో జరుపుకునే పండుగ గా పేర్కొన్నారు. ముగ్గుల పోటీలలో విజేతలుగా మొదటి బహుమతి స్వాతి ,సంపూర్ణ టీం మెంబర్స్, రెండవ బహుమతి పాతుకుల హేమలత, మూడవ బహుమతి రగడంపల్లి అలివేల, లక్ష్మి టీం మెంబర్స్, విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారందరికీ విజేతలుగా మొదటి బహుమతి 3000, రెండవ బహుమతి 2000, మూడో బహుమతి 1000 సర్పంచ్ చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ సర్పంచ్ వర్కాల బాల నారాయణ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వర్కాల బాలనారాయణ, ఉప సర్పంచ్ బద్దెల బాల లింగయ్య, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్ యాదవ్ పదిమంది వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ పెద్దలు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టును ఖండిస్తున్నాం

**సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



**కడ్తాల్, జనవరి 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఓ టివి ఛానల్ జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారి, సుధీర్ లను అర్ధ రాత్రి పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సర్పంచుల సంఘము మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. .బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు గానీ, ఆ వార్త సంస్థ గాని నిరాధారమైన, అసత్య వార్త కథనాలు రాస్తే ఆ విషయంలో ఖండన కోరుకోవచ్చు, అప్పటికీ వారు స్పందించకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకోవచ్చు కానీ, ఇలా అర్ధరాత్రి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారిని అరెస్టు చేయడం సరైంది కాదని అన్నారు. ఈ ముగ్గురూ జర్నలిజంలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులు. వీరి అరెస్టును తెలంగాణ ఫ్రీలాన్స్ జర్నలిస్టుల తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇదే సమయంలో జర్నలిస్టులకు ఒక సూచన చేస్తూ ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారుల విషయంలో నిరాధారమైన వార్తలను ప్రసారం గాని, ప్రచురించవద్దని, ఆధారాలు ఉంటేనే వార్తలు వేయాలని, ముఖ్యంగా ఎవరి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వార్త కథనాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా మీడియా సంస్థలదే అని కోరారు. ఏది ఏమైనా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం అర్ధరాత్రి పూట తీవ్రవాదుల మాదిరి అరెస్టు చేయడం ఎంత మాత్రం సమంజసం కాదని, వెంటనే ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకొని అరెస్టు చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కంబాల పరమేష్ మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, మూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి గాలి పటాలు ఎగురవేసి ప్రజలకు భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ, ఇటీవల హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్లో 40 దేశాలు పాల్గొన్నాయని, వందలాది కైట్ ప్లేయర్లు వచ్చారని, 1200 స్వీట్లు, పిండి వంటల స్టాళ్లు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. వచ్చే ఏడాది లోపు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసి, సంక్రాంతి సందర్భంగా ఇక్కడే కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు.హుస్నాబాద్‌లో మహాసముద్రం గండి, సర్దార్ పాపన్న గుట్టలు, భైరవ స్వామి గుడి, అర్బన్ పార్క్, రాయికల్ వాటర్ ఫాల్స్, ఎల్లమ్మ చెరువు, ఎల్లమ్మ ఆలయం, పొట్లపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయం, కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం, గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్ట్ వంటి ప్రదేశాలు టూరిజం అభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు.రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మా రవీందర్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాయిని రజిత, కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పట్టణ మాజీ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్, వి.వి. రమణ, కోమటి సత్యనారాయణ, ఆయిత శ్రీధర్, బూరుగు కృష్ణస్వామి, కేశవేని రమేష్, పున్నసది, పూదరి శ్రీనివాస్, ముప్పిడి రాజిరెడ్డి, గట్టు రాములు, వెన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

# సంబురంగా ముగ్గుల పోటీలు



**ఆమనగల్లు, జనవరి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీలోని సంకటోని గ్రామంలో భోగి పర్వదినం సందర్భంగా బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సంబురంగా జరిగాయి. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీలలో విజేతలైన మహిళలకు మొదటి బహుమతిగా రూ.3000 రూపాయలు పట్టుచీర, ద్వితీయ బహుమతిగా రూ. 2000 పట్టుచీర, ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరికీ పట్టు చీరలు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో కమటం వెంకటయ్య రాధమ్మ, బాలకృష్ణ అనంత రాములు, దావగిరి,కృష్ణయ్య, మహేష్,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి అక్రమణపై ప్రజల ఫిర్యాదు



**కరీంనగర్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రేకుర్తి గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 133 ఆక్రమణకు గురవుతుందనే ఆందోళనతో స్థానిక ప్రజలు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ భూమిని కాజేయాలని కొందరు ప్రయత్నించగా, అప్పట్లో ప్రజలు అప్రమత్తమై అధికారులకు సమాచారం ఇచ్చి ఆస్తిని కాపాడుకున్నారు. తాజాగా ఒక కుటుంబానికి చెందిన వ్యక్తి తన తాత పేరు ధరణి వెబ్‌సైట్‌లో కనిపిస్తుందని ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు.వాస్తవానికి ఈ భూమి ప్రభుత్వ ఆస్తి అని, సంబంధిత పట్టాలు, పాసుబుక్కులు పరిశీలించకుండా తాసిల్దారు చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతుంటే, ప్రజా ఆస్తులను కబ్జాదారులు ఆక్రమించుకోవడం అన్యాయమని వారు పేర్కొన్నారు.రేకుర్తి ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతూ, ఈ భూమిని రక్షించి ఇల్లు లేని నిరుపేదలకు గృహ స్థలాలుగా కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రేకుర్తి ప్రజల ఆస్తులు రేకుర్తి ప్రజలకే చెందాలి. కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములను కాపాడి, నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలి అని గ్రామస్థులు స్పష్టం చేశారు.

# అంగరంగ వైభవంగా గోదాదేవి

**--రంగనాయక స్వామి తిరుకల్యాణం**



**కరీంనగర్, జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయంలో గోదాదేవి రంగనాయక స్వామి తిరుకల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున భక్తులు వీక్షించి కన్నుల పండుగగా ఆస్వాదించారు. స్వామి--అమ్మవారి దివ్య కల్యాణాన్ని దర్శించి మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీలో భారీ చేరికలు



**కరీంనగర్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్‌లో బీజేపీలో చేరికల పర్వం ప్రారంభమైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు కాషాయ కండువా కప్పి పార్టీకి చేరారు.కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో 51వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు వేణు, ఆయనతో పాటు 50 మంది బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. అదేవిధంగా బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సాధినేని మునీందర్, రాంనగర్‌కు చెందిన కల్వకుంట్ల ప్రమోద్ రావు, మంకమ్మతోట గాజె శివరాం తదితరులు కూడా బీజేపీలో చేరారు.ఈ కార్యక్రమంలో బండి సంజయ్ నేతలను పార్టీకి ఆహ్వానిస్తూ కాషాయ కండువా కప్పి స్వాగతం పలికారు.

---

# గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభకాంక్షలు

**సర్పంచ్ కేతిరెడ్డీ భాగ్య లక్ష్మరెడ్డి**



**ఇల్లంతకుంట జనవరి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఇల్లంతకుంట మండలం సోమరంపేట గ్రామ ప్రజలకు సర్పంచ్ కేతిరెడ్డీ భాగ్య లక్ష్మరెడ్డి సంక్రాంతి శుభకాంక్షలు తెలియజేస్తూ భోగి, సంక్రాంతి, కనుమ చెడును దహనం చేస్తూ భోగి, సంతోషానికి , సంవృద్ధికి స్వాగతం పలుకుతూ సంక్రాంతి, పశు సంపదను ప్రేమిస్తూ కనుమ మీకు, మీకుటుంబ సభ్యులకు ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# వెల్దండలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు



**వెల్దండ, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంక్రాంతి పండుగ సందర్భంగా వెల్దండ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.మొదటి బహుమతి రూ.2,000, రెండవ బహుమతి రూ.1,500, మూడవ బహుమతి రూ.1,000తో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మట్ట వెంకటయ్య గౌడ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ఆర్య వైశ్య మహాసభల జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఉపసర్పంచ్ బస్నమోని శ్రీను, వార్డ్ సభ్యులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన సంఘం నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరి

**-- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లను ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లు, సుడా అధికారులతో సమావేశం నిర్వహించి భూముల రిజిస్ట్రేషన్లు, నిషేధిత జాబితా, లేఅవుట్ అంశాలపై సమీక్ష చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖల వద్ద నవీకరించిన నిషేధిత భూముల జాబితా ఒకే విధంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని, ఆ జాబితా ప్రతి కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని సూచించారు. కొనుగోలు, అమ్మకం దారులు రిజిస్ట్రేషన్‌కు ముందే మార్గదర్శకాలు చదివేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.మున్సిపల్ ఎస్ఓపి ఉత్తర్వుల ప్రకారం కుటుంబ ధ్రువీకరణ పత్రం, ఇంటి నంబరు ఆధారంగా రిజిస్ట్రేషన్ జరగాలని, అక్రమ హౌస్ నంబర్లు ఇప్పటికే రద్దు చేశామని, ఆ జాబితా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిస్తున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సిసిఏ రూల్స్ ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ముందు లేఅవుట్ ప్రక్రియను తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. తహసిల్దార్లతో ప్రత్యేకంగా మాట్లాడుతూ, ప్రజాసేవలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తుందని, సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సందర్శించి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

# చెదురుపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభం



**వెల్దండ, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చెదురుపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్--5 క్రికెట్ టోర్నమెంట్ ను వెల్దండ మండల మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ -- "క్రీడలు యువతను మంచి మార్గంలో నడిపిస్తాయి. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందిస్తాయి. క్రీడలతో దేశానికి పేరు ప్రతిష్టలు పెరుగుతాయి. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపి ముందుండాలి" అని అన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దన్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పోలే అశోక్, జానీ, రామకోటి, చిన్న అంజి, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# యువత క్రీడల వైపు మొగ్గు చూపాలి

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



**మంచాల , జనవరి 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** క్రికెట్ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు బుగ్గతండా క్రికెట్ లీగ్ పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.మంచాల మండలం బుగ్గతండా లో క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి . ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 10000 మరియు రెండవ బహుమతి 5000 మరియు అన్ని షీల్డులు స్పాన్సర్ చేసిన ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ అధిస్తునట్లు తెలిపారు.క్రీడల వల్ల శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసం నూతన పరిచయాలు ఏర్పడతాయన్నారు డ్రగ్స్ నియంత్రణ కొరకు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసి డ్రగ్స్ గంజాయి రహిత రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి పోలీసు అధికారులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుకు సాగాలని క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య , మార సురేష్ , దాసరమోని రమేష్, మానిపాటి వెంకటేష్ , కంబాలపల్లి బుగ్గరాములు , యూత్ కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, ఆర్ల శ్రీకాంత్ , పాండాల శ్రీనివాస్ ,భాస్కర్ రైనా, దాసరమోని అశోక్ ,రావుల నాగరాజు , బుడిగల పరమేష్, సపావత్ లచ్చిరాం , కొల్లోజు మహేష్ చారి , సపావట్ గణేష్ , ఉదయ్ శ్రీకాంత్ , వెంకటేష్ , మరియు బుగ్గతండా గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ముదిమాణిక్యంలో ఆంజనేయ స్వామి వార్షికోత్సవం



**అడవిదేవులపల్లి, జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముదిమాణిక్యం గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి 5వ వార్షికోత్సవం సందర్భంగా పూజోత్సవం అనంతరం మహానదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదానానికి దాతగా దేవాద్రి కోటేశ్వర శర్మ సహకరించారు.తరువాత ఎద్దుల పందాలను ఎమ్మెల్సీ ఒ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ కేతవత్ శంకర్ నాయక్ ప్రారంభించారు. విజేతలకు ప్రైజ్ మనీ అందజేశారు.కార్యక్రమంలో అడవిదేవులపల్లి సర్పంచ్ కూరాకుల చిన్న రామయ్య, ముదిమాణిక్యం సర్పంచ్ రామావత్ వెంకటేశ్వర్లు, కమిటీ అధ్యక్షుడు సుర ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పిల్లి చంద్రయ్య, మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మోటకొండూరు పిహెచ్సి లో పండ్ల పంపిణీ






- తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఆసుపత్రిలో సేవా కార్యక్రమం
- బోట్ల సుశీల--ఎల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేషెంట్లకు పండ్లు

**మోటకొండూరు, జనవరి 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
మోటకొండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి)లో బుధవారం అమ్మా--నాన్న వర్ధంతి సందర్భంగా పేషెంట్లకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రెండు సార్లు వార్డు సభ్యురాలిగా సేవలందించిన బోట్ల సుశీల, ఆమె భర్త ఎల్లయ్య ప్రజల కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి జ్ఞాపకార్థంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కుటుంబానికే కాకుండా గ్రామ ప్రజలందరికీ వారు చేసిన సేవలు మరువలేనివని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం బోట్ల సుశీల -- ఎల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోట్ల శ్రీనివాస్ నాయకత్వంలో జరిగింది. శ్రీనివాస్ గారు తన మిత్రులతో కలిసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో 3వ వార్డు సభ్యులు వంగపల్లి సౌందర్య--మహేందర్, మాజీ వార్డు సభ్యులు బోట్ల నరేష్, ఏంఆర్పిఎస్ మండల అధ్యక్షులు వంగపల్లి చిరంజీవి, వంగల స్వామి, బోట్ల నాగులు, బోట్ల పరమేష్,వంగపల్లి నరేష్, బోలగని నరేష్, వడ్డేబోయిన మహేష్, బోట్ల కరుణాకర్‌తో పాటు పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, అమ్మా--నాన్న గార్ల సేవా భావాన్ని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# మహారాష్ట్రలో మేకల బ్యాంక్!

**నగదుకు బదులు రుణంగా మేక అందజేత**




**ముంబై జనవరి 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో ఒక బ్యాంక్ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ బ్యాంక్‌కు రుణం కోసం వెళ్తే నగదుకు బదులుగా ఒక మేకను రుణంగా ఇస్తారు. ఈ గోట్ బ్యాంక్ ఇప్పటివరకు ఇలా 300 మందికి మేకలను రుణంగా ఇచ్చి వారికి ఉపాధి కల్పించింది. ఇందులో వితంతువులు, భూమిలేని మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఈ రుణంతో వారు స్వయం ఉపాధి పొందుతున్నారు. జల్గావ్‌లోని ఒక ఫౌండేషన్ నడుపుతున్న ఈ బ్యాంక్ దగ్గరకు రుణం కోసం వెళ్లే మహిళలకు తొలుత వాటిని ఎలా పెంచాలో శిక్షణ ఇస్తారు.తర్వాత వారికి ఒక మేకను రుణంగా ఇస్తారు. అయితే ఇక్కడ బ్యాంక్ రుణం ఎలా తీరుస్తారు అన్న సందేహం వస్తుంది ఎవరికైనా, మేకను రుణంగా తీసుకున్నారు కాబట్టి వారు తిరిగి మేకనే రుణ బకాయిగా బ్యాంక్‌కు చెల్లించాలి. అది ఎలాగంటే రుణం తీసుకున్న మహిళ తన మేకకు పుట్టిన మేక పిల్లను బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలి. ఇలా 40 నెలల రుణ ఒప్పంద కాలంలో ఆ మహిళ నాలుగు ఆరోగ్యకరమైన మేక పిల్లలను బ్యాంక్‌కు ఇస్తుంది. అలా ఇచ్చిన మేక పిల్లలు పెద్దవైన తర్వాత బ్యాంక్ వారు దానిని ఇంకొకరికి రుణంగా ఇస్తారు. ఈ పథకం కారణంగా ప్రతి మహిళ ఏడాదికి రూ.30 వేలు సంపాదిస్తున్నట్టు స్థానికులు తెలిపారు.

# ఘనంగా సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు



**అమ్రాబాద్, జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భోగి సందర్భంగా సంక్రాంతి పండుగలో భాగంగా అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినారాయణ గౌడ్, ఎన్ఎస్ యుఐ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, డిసిసి కార్యదర్శి, ఎన్ఎస్ యుఐ తాలూకా అధ్యక్షుడు లడ్డు యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రణీత, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బలమని, గ్రామ సర్పంచ్ చంద్రమౌళి పాల్గొన్నారు.గ్రామ యువకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సంక్రాంతి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

# తీదేడు గ్రామ అభివృద్దే మా లక్ష్యం

-తీదేడు స్టేజి నుండి గ్రామానికి వెళ్ళే రోడ్డుకు ఇరువైపుల వాహాన దారులకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగిస్తున్న సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి .
-ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి
-తీదేడు గ్రామ సర్పంచ్ .



**దేవరకొండ,జనవరి 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామ అభివృద్దే మా లక్ష్యమని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ అన్నారు.బుధవారం తీదేడు స్టేజి వద్ద నుండి గ్రామానికి వెళ్ళే రహాదారి లో ఇరువైపుల వాహాన దారులకు అడ్డంగా ఉన్న చెట్లను జె.సి.బి తో తొలగిస్తున్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ...గ్రామ అభివృద్ది కోసం ప్రతి ఒక్కరు సహాకరించాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,మాజీ ఉప సర్పంచ్లు ఉలుపాల శేఖర్ రెడ్డి,ధరణిపతి రమణారావు,పి.ఏ.సి.యస్ మాజీ డైరెక్టర్ తిరుమణి పాపయ్య,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్ ముదిరాజ్,మర్ల యాదయ్య,సివర్ల పర్వతాలు యాదవ్,బిఆర్ఎస్ నాయకులు సిమర్ల శ్రీను యాదవ్,మొరుపోజు లక్ష్మిపతి,మఱ్రు జనార్ధన్ రావు,వీరమల్ల వెంకటయ్య,సిమర్ల ఆంజనేయులు,మాధగోని మోహన్ గౌడ్,మునగాల అశోక్,ఉడుత చిన్న వెంకటయ్య,ఆమనూరి కుమార్,మిత్ర పక్షాల నాయకులు ఇడబోయిన శ్రీను,బెక్కం సాయి కుమార్, గ్రామస్తులు సందె బిక్షం,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎం. సత్యనారాయణ రావు జయంతి



**కరీంనగర్,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు స్వర్గీయ ఎం. సత్యనారాయణ రావు జయంతి సందర్భంగా కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రసంగించిన వారు యం.ఎస్.ఆర్ నిరాడంబరమైన జీవితం, నిజాయితీతో రాజకీయాల్లో ఆదర్శప్రాయుడిగా నిలిచారని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన పోరాటం, కరీంనగర్ అభివృద్ధిలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు.అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, ఆసుపత్రిలో అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన సేవలను స్మరించారు.



కల్వకుర్తిలో ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు



వెల్దండలో ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు

# కడ్తాల గణేష్ గిరివి దుకాణం యజమాని అరెస్ట్

-కుదువ పెట్టిన బంగారం స్వాధీనం

**కడ్తాల్, జనవరి 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు బీద అమాయక ప్రజలు గణేష్ గిరివి దుకాణం లో తాకట్టు పెట్టిన బంగారాన్ని రికవరీ చేసి గిరివి దుకాణ యజమాని బర్ఫా నన్నారం అలియాస్ నవీన్ ను అరెస్టు చేసినట్లు కడ్తాల్ సీఐ గంగాధర్, ఎస్సై వరప్రసాద్ లు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రం బేవర్ జిల్లా జైతారం మండలం రామర్ గ్రామానికి చెందిన బర్ఫాన్ నన్నారం అలియాస్ నవీన్ అతని సోదరుడు ధర్మారం ఇద్దరూ కలిసి కడ్తాల్ పట్టణంలో గణేష్ పాన్ బ్రోకర్స్ పేరుపై 2023 సంవత్సరంలో లైసెన్స్ సర్టిఫికెట్ తీసుకొని, అప్పటి నుండి ప్రజల వద్ద అధిక మొత్తంలో బంగారాన్ని తాకట్టు పెట్టించుకొని, తక్కువ మొత్తంలో డబ్బులు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైందని వారు పేర్కొన్నారు. ప్రజల వద్ద



కుదువ పెట్టుకున్న బంగారాన్ని కడ్తాల ముత్తూట్ ఫైనాన్స్ లో బంగారాన్ని బర్ఫా నన్నారం తాకట్టుపెట్టి డబ్బులు తీసుకున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పారు. తాకట్టు పెట్టుకున్న బంగారాన్ని ఇద్దరూ కలిసి సికింద్రాబాద్ కు చెందిన ఉత్తమ్ జీ ఏ ఉత్తంచంద్, వద్ద తిరిగి తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నారు. ప్రజలను మోసం చెసిన డబ్బులతో తమ అప్పులు తీర్చుకోవడంతోపాటు వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఉత్తమ్ వద్ద తాకట్టు పెట్టిన సుమారు 300 గ్రాముల బంగారాన్ని రికవరీ చేయడం చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో నిందితుడు ధర్మారం పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. దసర్ల పల్లి పెద్దమ్మ తాండ కు వచ్చిన గిరివి దుకాణ యజమాని బర్ఫా నన్నారం ను నమ్మదగిన సమాచారం మేరకు ఈనెల 13 పట్టుకొని విచారించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా అతన్ని రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి దర్యాప్తు జరిపిన ఎస్సై వరప్రసాద్, సిఐ గంగాధర్ లను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



**కరీంనగర్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మార్కెట్ రోడ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా అర్చకులు అర్చన చేసి తీర్థప్రసాదాలతో ఆయనను సత్కరించారు.ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ ఇకపై కరీంనగర్‌లో బిజెపి, బీఆర్ఎస్ ఆటలు సాగవని, ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ డంకా మోగిస్తుందని, ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ పార్టీదే విజయం అవుతుందని పేర్కొన్నారు.బుధవారం 39వ డివిజన్‌కు చెందిన బిజెపి నాయకుడు తంగెళ్ల విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి రాజేందర్ రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వి. ప్రసాద్, ఎం. ప్రవీణ్, గణేషు, ఎస్. అనిల్, ఎస్. అశోక్, ఎస్. మార్కండేయులు, సంపత్, క్రాంతి, సిలగాని రవి, వడ్నాల రాజమౌళి, ఎస్. ప్రవీణ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో అనంతుల రమేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్ భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం

- కమిషనర్ గౌస్ అలం



**కరీంనగర్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజల రక్షణ, శాంతిభద్రతలు, మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసింది. కమిషనర్ గౌస్ అలం తెలిపారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించగా, కరీంనగర్ బస్టాండ్, ఆర్టీసీ కార్గో పార్సెల్ కేంద్రంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలీసు జాగిలం లియో కూడా పాల్గొంది. ప్రధాన కూడళ్ళలో వాహన తనిఖీలు కొనసాగుతున్నాయని, నేరాలను అరికట్టడంలో, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువుల కదలికలను గుర్తించడంలో ఈ చర్యలు ఉపయోగపడతాయని కమిషనర్ పేర్కొన్నారు.వాహనదారులు, ప్రజలు సహకరించాలని కోరుతూ, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670744 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా రంగంలో ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో యువతకు క్రికెట్ కిట్ పంపిణీ



**హుస్నాబాద్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంచి, క్రీడా రంగంలో ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించిన క్రికెట్ కిట్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని అందిస్తాయని, మంత్రి అందించిన కిట్‌లు గ్రామ యువతకు నిరంతరం ఉపయోగపడతాయని తెలిపారు. యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కానవేని శివకుమార్, ఉప సర్పంచ్ కానవేని జితేందర్, వార్డు సభ్యుడు కొత్త మధు పాల్గొని క్రీడల ద్వారా పోటీ భావన, క్రమశిక్షణ అలవడుతుందని యువతను ప్రోత్సహించారు. సామాజిక సేవకుడు సుధగోని శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలు యువత జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, శారీరక ఆరోగ్యం, ఒత్తిడిని తట్టుకునే శక్తి, సమయపాలన వంటి లక్షణాలు క్రీడల ద్వారా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుధగోని ఇందిర, కోల రజిత పాల్గొని, కిట్‌లను సమన్వయంతో వినియోగించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సనాతన ధర్మం యొక్క సంపూర్ణ భావాన్ని ప్రతిబింబించేల రంగవల్లి

**పెద్దపల్లి ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన పబ్బతి నీత కృష్ణారెడ్డి ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా సమాజానికి ఉపయోగపడేలా, సందేశాత్మకంగా ముగ్గులు వేశారు.ఈ ముగ్గులో ఆయన సనాతన ధర్మం యొక్క సంపూర్ణ భావాన్ని ప్రతిబింబించారు. మధ్యలో ధ్యానం చేస్తున్న వ్యక్తి మన అంతర్ముఖ ప్రయాణం, ఆత్మశాంతిని సూచిస్తాడు.



ఓం సృష్టికి మూలమైన ప్రణవ నాదం, మనస్సును ఏకాగ్రం చేసి పరమాత్మతో అనుసంధానం చేస్తుంది. స్వస్తిక్ శుభం, మంగళం, సమతుల్యతకు ప్రతీకగా నిలుస్తుంది. దేవాలయం రూపకల్పన ద్వారా దేవుడు కేవలం ఆలయంలోనే కాకుండా మన హృదయంలో కూడా ఉన్నాడన్న భావాన్ని తెలియజేశారు. తామర పువ్వు మురికిలో పుట్టినా కలుషితం కాకుండా వికసించేలా, మనం కూడా ప్రపంచంలో ఆసక్తులు, ఆవేశాల నుంచి దూరంగా పవిత్రంగా, ధర్మబద్ధంగా జీవించాలన్న సందేశాన్ని అందించారు. ఈ ముగ్గు ద్వారా ధ్యానం, భక్తి, పవిత్రత, ధర్మం అన్నీ కలిసినప్పుడు శాంతియుతమైన జీవితం సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

# సమృద్ధిగా ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మహా పడిపూజ

**అమ్రాబాద్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శ్రీ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమామహేశ్వర క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో ఆంజనేయ స్వామి దేవాలయానికి భూమి పూజ జరగనుందని తెలిపారు. శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధిగాంచిన ఈ దేవాలయాన్ని ప్రజా ప్రభుత్వంలో విశేషంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. దేవాలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత మంచినీటి ప్లాంట్, లడ్డు



ప్రసాద కౌంటర్ ప్రారంభించగా, నంది సర్కిల్ ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. ఉమామహేశ్వర కొండపైకి కొత్తగా బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు బాత్రూములు నిర్మించారు. ఈనెల 16న పార్వతీ--పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం జరగనుండగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శివ, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, లచ్చు నాయక్, బిచ్య నాయక్, పాలకమండలి డైరెక్టర్లు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆడంబరంగా వాసవి వనిత ఏంజిల్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



**కరీంనగర్, జనవరి 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సంక్రాంతి పండుగ సందర్భంగా కరీంనగర్ వాసవి వనిత ఏంజిల్స్ ఆధ్వర్యంలో అజ్మత్‌పూర్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. భోగి మంటలు వెలిగించడం, గాలిపటాలు ఎగరేయడం, బోడబోడ పండ్లు పోయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో వాసవియన్ పబ్బ అరుణ, రాచమల్ల గాయత్రి, అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి, కార్యదర్శి పల్లెర్ల విద్య, కోశాధికారి గుండ శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు బండ సంధ్యారాణి, జాయింట్ సెక్రటరీ జిల్లా రమాదేవి తో పాటు క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 100 మందికి గాలిపటాలు, 20 మందికి బోడబోడ పండ్లు పంపిణీ చేయగా, అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. మొత్తం 200 మంది పాలకమండలి సభ్యులు, క్లబ్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని సంక్రాంతి ఉత్సవాలను ఆనందంగా జరుపుకున్నారు.

# లారెన్స్ గ్యాంగుతో భారత ప్రభుత్వానికి సంబంధాలు..

## కెనడా తాజా ఆరోపణ

**న్యూఢిల్లీ-జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇండియాలో పోలీసుల అదుపులో ఉన్న గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కు, భారత ప్రభుత్వానికి మధ్య సంబంధాలున్నాయని కెనడా ఆరోపించింది. కెనడాలో ఇండియా ప్రభుత్వం తరఫున లారెన్స్ గ్యాంగ్ పని చేస్తోందని అక్కడి పోలీసు విభాగం ఆర్సీఎంపీ (రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్) వెల్లడించింది. లారెన్స్ బిష్ణోయ్, అతడి గ్యాంగును తీవ్రవాద సంస్థగా గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించి తాజాగా ఒక నివేదిక వెల్లడైంది. అయితే, ఈ నివేదిక ఎప్పటిది అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. కొంతకాలంగా ఇండియా-కెనడా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. కెనడాలో హర్దీప్



సింగ్ నిజ్జర్ హత్య జరిగింది. అతడిని చంపింది భారతీయులే అని, ఇందులో భారత ప్రభుత్వానికి సంబంధం ఉందని కెనడా ఆరోపించింది. లారెన్స్ గ్యాంగ్ ఈ పని చేసినట్లు తెలిపింది. అయితే, కెనడా చేసిన ఈ ఆరోపణల్ని ఇండియా ఖండించింది. తమపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు అంతర్జాతీయ సమాజం ముందుంచాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోంది. తాజాగా కెనడాలో భారత రాయబారి దినేష్ పట్నాయక్ కూడా ఇదే అంశంపై వ్యాఖ్యానించారు. చాలా కాలంగా ఇండియాపై కెనడా ఆరోపణలు చేస్తోందని, కానీ, దీనికి తగిన ఆధారాలు మాత్రం చూపించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు.. కెనడా తీవ్రవాదులకు అడ్డాగా మారిందని విమర్శించారు. ఈ విషయం 40 ఏళ్లుగా తాము చెబుతున్నామని దినేష్ అన్నారు. కెనడా కేంద్రంగా భారత వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నా, అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఇరు దేశాలు తమ రాయబారుల్ని తొలగించుకున్నాయి. పది నెలల అనంతరం.. అంటే గత ఆగస్టులో ఇరు దేశాలు తిరిగి రాయబారుల్ని నియమించుకున్నాయి.

# జాతీయ కరాటే-కుంగ్‌ఫూ పోటీల్లో అర్మాన్ ఖాన్ గ్రాండ్ ఛాంపియన్



**కరీంనగర్ ,జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వరంగల్ హన్మకొండలోని జకిరియా గార్డెన్స్‌లో జరిగిన జాతీయ స్టేయ్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో కరీంనగర్ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 900 మంది పోటీల్లో పాల్గొనగా, ఇంటర్నేషనల్ గొజిరాయ్ కరాటే అకాడమీ శిక్షణ పొందుతున్న 21 మంది విద్యార్థులు 11 బంగారు, 7 రజత, 3 కాంస్య పతకాలు సాధించారు. కోలార్ బెల్ట్ అండర్-19 విభాగంలో అర్మాన్ ఖాన్ గ్రాండ్ ఛాంపియన్‌గా నిలవడం విశేషం. జూనియర్ విభాగంలో సునీల్, స్వరూప్ దాస్, శ్రీకర్ విజయం సాధించగా, అమ్మాయిల విభాగంలో జోయా, అనం, సఫా సుల్తానా, అడిబా నుస్రత్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. ఈ విజయాలను గోజిరాయ్ కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అన్వర్ ఖాన్ ప్రకటించారు. టోర్నమెంట్ ముఖ్య అతిథి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా అర్మాన్ ఖాన్ బహుమతి అందుకున్నారు. గ్రాండ్ మాస్టర్ అక్బర్ ఖాన్, సీనియర్ మాస్టర్ చరణ్, పి. జయందర్, దల్జీత్, సంజీవన్ సింగ్, జవేరియా, ఫహ్మిదా ఖాతూన్, అయ్యూబ్ ఖాన్, సమీనా తదితరులు విజేతలను అభినందించారు.

# ఒంటరి వ్యక్తుల కోసం యాప్.. చైనాలో ఫుల్ వైరల్

**బీజింగ్ -జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చైనాలో ఇప్పుడో కొత్త యాప్ పెను సంచలనం సృష్టిస్తున్నది. ఆర్ యూ డెడ్ అనే యాప్ ఇప్పుడు చైనాలో తెగ వైరల్ అవుతున్నది. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. దీంతో ఆ యాప్‌ను సృష్టించిన కంపెనీ ఇప్పుడు దాని కోసం సబ్‌స్క్రిప్షన్ ఫీజును కూడా ప్రవేశపెట్టింది. చైనీస్ భాషలో సిలిమి అని ఆ యాప్‌ను పిలుస్తున్నారు. దీన్ని ఆర్ యూ డెడ్ అని ఇంగ్లీష్ భాషలో అంటున్నారు. అయితే ఒంటరిగా ఉండే వ్యక్తుల కోసం ఆ యాప్‌ను రూపొందించారు. ఒంటరిగా ఉండే విద్యార్థులైనా లేక ఆఫీసుల్లో పనిచేసే ఒంటరి వ్యక్తులైనా లేక ఒంటరి జీవితాన్ని ఇష్టపడేవారిని టార్గెట్ చేస్తూ ఈ యాప్‌ను తయారు చేశారు. ఆ యాప్ ద్వారా ఓ ఎమర్జెన్సీ కాంటాక్ట్ ఏర్పాటు చేసుకోవాలి. వరుసగా రెండు రోజులు యూజర్ ఆ యాప్‌ను




చెక్ చేయకుంటే అది ఆటోమెటిక్‌గా నోటిఫికేషన్లు పంపుతుంది. చైనాలో ఒంటరిగా జీవిస్తున్న వారి సంఖ్య సుమారు 20 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. సోలోగా జీవించే వారి సంఖ్య వార్షికంగా 30 శాతం పెరిగిపోతున్నట్లు అంచనాలు ఉన్నాయి. చైనా డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, ఒంటరి వ్యక్తుల కోసం ఆ యాప్‌ను ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నారు. డెముమూ పేరుతో ఆ యాప్‌ను రిలీజ్ చేస్తున్నారు. యాపిల్ పెయిడ్ యాప్ చార్ట్‌లో దీన్ని డెముమూ అని పిలుస్తున్నారు. ఆర్ యూ డెడ్ యాప్ కాన్సెప్ట్ చాలా సింపుల్‌గా ఉంది. రెండు రోజులకు ఒకసారి చెకిన్ కావాలి. ఓ పెద్ద బటన్‌ను ప్రెస్ చేస్తే, బ్రతికి ఉన్నట్లు ఆ యాప్ గుర్తిస్తుంది. ఒకవేళ అలా చేయకుంటే, అప్పుడు ఎమర్జెన్సీ నెంబర్‌కు కాంటాక్ట్ అవుతుంది. మీరు సమస్యల్లో ఉన్న విషయాన్ని ఆ నెంబర్‌కు సమాచారాన్ని అందిస్తుంది. వాస్తవానికి గత ఏడాది మేలో ఈ యాప్‌ను లాంచ్ చేశారు. కానీ గత కొన్ని వారాల నుంచి ఆ యాప్‌కు క్రేజ్ పెరిగింది. చైనీస్ పట్టణాల్లో ఒంటరిగా జీవిస్తున్న వారు ఎక్కువగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. అయితే దేశంలోనే అత్యధిక సంఖ్యలో డౌన్‌లోడ్ చేసుకున్న పెయిడ్ యాప్‌గా ఇది నిలిచింది.

# వలపు వలౌ దంపతుల ఎర బట్టబయలు

**కరీంనగర్, జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సోషల్ మీడియా వేదికగా యువకులను వలలో వేసి డబ్బులు వసూలు చేస్తున్న భార్యాభర్తల బాగోతాన్ని కరీంనగర్ రూరల్ పోలీసులు బయటపెట్టారు. ఆరేపల్లి శ్రీ సాయి నివాస అపార్ట్మెంట్‌లో నివసిస్తున్న దంపతులు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన వ్యక్తులను తమ వద్దకు రప్పించి, వీడియోలు రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు బయటపడింది. బాధితుడు పోలీసులకు




ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టి వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి నగదు, మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నేరాన్ని ఒప్పుకున్న దంపతులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించి నిందితులను పట్టుకున్న రూరల్ పోలీసు సిబ్బందిని ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు.

# చనిపోయిందనుకున్న బామ్మ లేచింది

## బర్త్‌డే వేడుకగా మారిన అంత్యక్రియల ఘట్టం..

**నాగపూర్, - జనవరి 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఒక్కోసారి అనూహ్య ఘటనలె, అద్భుతాలు జరుగుతుంటాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇలాంటి అనూహ్య ఘటన చోటుచేసుకుంది. చనిపోయిందనుకున్న బామ్మ బతికింది. అందరిలోనూ ఆశ్చర్యంతో పాటు, ఆనందం కూడా కలిగింది. అదేరోజు బామ్మ బర్త్‌డే కావడంతో చావుకు వచ్చిన వారంతా కేక్ కట్ చేసి బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే...నగరానికి చెందిన 103 ఏళ్ల వృద్ధురాలు గంగాబాయి సఖారే కొన్ని రోజులుగా అస్వస్థతతో



బాధపడుతున్నారు. సోమవారం ఉదయం ఆమె మరణించినట్టు కుటుంబసభ్యులు నిర్ధారించుకున్నారు. చివరి చూపు కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా..వృద్ధురాలి కాలి వేలు కదలడాన్ని ఆమె మనవడు రాకేష్ సఖారే గమనించాడు. వెంటనే అక్కడి వారికి విషయం చెప్పడంతో ఆమె ముక్కులో ఉన్న దూదిని తొలగించగా వృద్ధురాలు శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. దీంతో చనిపోయిందనుకున్న గంగాబాయి బతికే ఉన్నందుకు కుటుంబసభ్యులు సంతోషపడ్డారు. వైద్యులు కూడా ఆమెను పరీక్షించి..ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా అదే రోజు గంగాబాయి 103వ పుట్టిన రోజు కూడా కావడంతో వేడుకలను కుటుంబసభ్యులు ఘనంగా జరిపారు. అంతసేపు బాధలో ఉన్న బంధువులంతా బర్త్‌డే కేక్ తిని ఆనందంగా తమ ఇళ్లకు వెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది.